క్లుప్తంగా

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చ కాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 17, దొండ 35, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 15, దోసకాయ 28, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 18, చామగడ్డ 50, మొరంగడ్డ 13, కందగడ్డ 35, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ బోయిగూడలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 2 ఆదివారం బీఆర్‌ఎస్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు వెంకటేషన్, రాజేందర్, వినయ్, మహేందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 లకు నిర్వహించే కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లాఇన్‌చార్జి దాసోజు శ్రావణ్‌కుమార్, తలసాని సాయి కిరణ్ యాదవ్, కార్పొరేటర్ హేమలత హాజరవుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలకు సంప్రదించండి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని విద్యుత్ అంతరాయంలో పరిష్కారం కోసం వినియోగదారులు చేయాల్సిన నెంబర్లు మారినట్లు ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఏదైనా సమస్యలు ఉంటే వినియోగదారులు ఈ నంబర్లను సంప్రదించాలన్నారు.

బొల్లారం: 9690619752, 040–23433553
ఆర్‌పీ నిలయం : 9490619748, 040– 23433551
లాల్‌బజార్ : 9490619750
మారేడుపల్లి : 9490619728, 040– 23433352
జింఖానా, కార్ఖానా : 9490619726, 040–23433592
కాల్ సెంటర్ నెంబర్ : 1912
కంట్రోల్ రూమ్ : 9491629380

రేపు కడియం రాజు శ్రద్ధాంజలి సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఏబీవీపీ జాతీయ నాయకుడు దివంగత కడియం రాజు శ్రద్ధాంజలి సభ రేపు (3న) ఓయూ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియం జరగనుంది. విద్యార్థిగా 20 సంవత్సరాలు ఏబీవీపీ ఓయూ అధ్యక్షుడు మొదలు జాతీయ స్థాయి వరకు పని చేసిన తొలి దళిత నేత కడియం రాజు గత నెల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఏబీవీపీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి కడియం రాజు ఆత్మీయమిత్రులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, సహచరులు హాజరుకావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అధికారులతో కలిసి పర్యటిస్తున్న నాయకులు

అడ్డగుట్ట: డివిజన్ పరిధిలోని సమస్యలు గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు లింగాని శ్రీనివాస్ తెలిపారు. కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆదేశాల మేరకు శనివారం జీహెచ్‌ఎంసీ, విద్యుత్ అధికారులతో కలిసి డీ–సెక్షన్‌లో పర్యటించి మాట్లాడారు. స్థానికంగా నెలకొని ఉన్న సమస్యలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నామన్నారు. విద్యుత్ స్తంభాల తరలింపు, కేబుల్ వైర్ల మార్పు తదితర అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. శ్రీనివాస్ గౌడ్, పొన్నాల రాజు, గోపి, రాజు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు.

ఆత్మీయ సమ్మేళనం వాయిదా!

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ నేతల మధ్య ఆధిపత్య పోరు ఆత్మీయ సమ్మేళనాలపై పడింది. ముందస్తుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఆదివారం బోయిన్‌పల్లిలో నిర్వహించాల్సిన ఆత్మీయ సమ్మేళనం అర్ధంతరంగా వాయిదా పడింది. అందరినీ కలుపుకుని పోవాల్సిన ఆత్మీయ సమ్మేళనాలు కాస్తా, గ్రూపు రాజకీయాలకు వేదికగా మారాయి. వార్డు అధ్యక్షుల ఆధ్వర్యంలో జరగాల్సిన ఆత్మీయ సమ్మేళనాల్లో బోర్డు మాజీ సభ్యుల పెత్తనాన్ని పలువురు పార్టీ నేతలు తప్పుబడుతున్నారు. బోర్డు సభ్యులు మాజీ అయ్యి రెండేళ్లు పూర్తవుతున్నా ఇంకా వారినే అధికారికంగా గుర్తించమేంటని ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి పార్టీ కేడర్‌లో నెలకొన్న అసమ్మతి, ఇతరత్రా కారణాలేంటో తెలియదు కానీ ఆదివారం బోయిన్‌పల్లిలో నిర్వహించాలని నిర్ణయించిన ఆత్మీయ సమ్మేళనానికి వాయిదా వేశారు. వాయిదా విషయమూ తమకు చెప్పలేదంటూ సీనియర్ నేతలు గుర్రుమంటున్నారు.

ఆస్పత్రి ఏర్పాటుకు ఆందోళనలు షురూ

- పిడికిలి బిగిస్తున్న మాణికేశ్వరీనగర్ వాసులు
- స్పష్టత వచ్చే వరకూ ధర్నాలు చేస్తామని హెచ్చరిక
- నేటి నుంచి పాదయాత్రలకు శ్రీకారం



మాణికేశ్వరీనగర్‌లో ఆస్పత్రి కోసం కేటాయించిన ఖాళీస్థలం ఇదే..

సికింద్రాబాద్: ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు కోసం ఏళ్ల తరబడి కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసిన ఓయూ మాణికేశ్వరీనగర్ వాసులు ఆందోళనలకు సమాయత్తం అవుతున్నారు. ఏప్రిల్ 2 న ఇంటింటి పాదయాత్రతో ఉద్యమాలకు సమాయత్తం అవుతున్నారు. ఇందుకోసం మాణిక్యేశ్వరీనగర్ (వడ్డెరబస్తీ)కు చెందిన అన్ని రాజకీయపార్టీల నాయకులు, ప్రజలు సంఘటితం అవుతున్నారు. సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉండడం, స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కేబినెట్ హోదాలో ఉన్న నేపథ్యంలో వచ్చే ఎన్నికల లోపు ఆసుపత్రి ఏర్పాటు కోసం 15 ఏళ్ల కిందట రూపొందించిన ప్రతిపాదనలకు కార్యరూపం లభించే విధంగా ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు.

2009లో ప్రతిపాదనలు సిద్ధం

తార్నాక డివిజన్ మాణికేశ్వరీనగర్‌లో 16 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం 2009లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అప్పటి వైద్య ఆరోగ్య శాఖ ఆసుపత్రి నిర్మాణం కోసం నిధులను కూడా మంజూరు చేసింది. ఆసుపత్రి నిర్మాణం కోసం పనులు ప్రారంభించే సమయంలో సదరు స్థలం తమదని పేచీపెట్టి ఓయూ అధికారులు అభ్యంతరం తెలపడంతో నిర్మాణం పనులు ముందుకు సాగలేదు. ఓయూ అధికారులతో చర్చలు జరిపి, స్థల వివాదం విషయాన్ని ఓ కొలిక్కి తెచ్చి ఆసుపత్రి నిర్మాణం జరిపే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు జరుగలేదు. సుమారు 16 వేల జనాభా ఉన్న ఈ బస్తీలో ఎలాంటి వైద్య సదుపాయాలు లేవు. కూలీనాలి చేసుకుని రెక్కల కష్టం ఆధారంగా బతికే బస్తీ వాసులు చిన్నపాటి రోగాలకు సైతం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

కానరాని ఖాళీస్థలం..

ఇదిలా ఉండగా ఆస్పత్రి కోసం కేటాయించిన మాణికేశ్వరీనగర్ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించుకునేందుకు ఓయూ అధికారులు ఉపక్రమించారు. ఇందుకోసం టెండర్ ప్రక్రియను ప్రారంభించారు. ఆస్తుల పరిరక్షణ పేరుతో ఇప్పటికే పలు భూములకు ప్రహరీ నిర్మించుకుని ఓయూ అధికారులు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. తాజాగా మాణికేశ్వరీనగర్‌లోని ఆసుపత్రి కోసం ప్రతిపాదించిన స్థలం చుట్టూ గోడ నిర్మించేందుకు సమాయత్తం అవుతున్నారు. అటు ఆసుపత్రి నిర్మాణం జరుగక.. ఇటు ఉన్న స్థలం కాస్త ఓయూ పరిధిలోకి వెళ్లిపోతుందని తెలుసుకున్న మాణికేశ్వరీనగర్ వాసులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ స్థలం కూడా అందుబాటులో లేకుండాపోతే భవిష్యత్‌లో ఆసుపత్రి ఏర్పాటు జరిగే అవకాశాలు ఎంతమాత్రం లేవు. బస్తీ పరిసరాల్లో నాలుగు దిక్కులా ఎక్కడా ఇసుమంతైనా ఖాళీ స్థలం లేకపోవడం గమనార్హం.

ఎన్నికల బహిష్కరణకు నిర్ణయం..

స్థల పరిరక్షణ, ఆసుపత్రి ఏర్పాటు కోసం ఈమారు ఉద్యమాలు చేయాలని మాణికేశ్వరీనగర్ వాసులు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఇప్పటికే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను కలిసి వినతి పత్రాలు అందించారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఇరు పార్టీల నాయకులు తరలివచ్చి సమస్యకు పరిష్కారం చూపించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని లేనిపక్షంలో ఓటుహక్కును బహిష్కరించేందుకైనా వెనుకాడకూడదన్న పట్టుదలతో నేటి నుంచి పాదయాత్రలకు శ్రీకారం చుట్టనున్నారు.

సకాలంలో పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించండి



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అధికారులకు మంత్రి ఆదేశం

సనత్‌నగర్: నియోజకవర్గ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. మాసాబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్, హెచ్‌ఎండీఏ, ఎలక్ట్రికల్, టౌన్‌ప్లానింగ్, హార్టికల్చర్ తదితర శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతం నుంచి బాలానగర్ చౌరస్తా వరకు అండర్‌పాస్ నిర్మాణం, ఫతేనగర్ ఫ్లైఓవర్ విస్తరణ పనుల కోసం హెచ్‌ఎండీఏ నుంచి రూ.100 కోట్లను మంజూరు చేసినందుకు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులను చేపట్టడానికి స్థల సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్‌లోని కేఎల్‌ఎన్ పార్కు అభివృద్ధి పనుల కోసం రూ.2.41 కోట్లు మంజూరయ్యాయని, పార్కులోని లేక్‌ను అభివృద్ధి చేయడం, మెడిటేషన్ సెంటర్ ఏర్పాటు, వాకింగ్ ట్రాక్, టాయిలెట్స్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు వంటి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. సనత్‌నగర్‌లో అత్యధికంగా 55 పార్కులు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసేందుకుగాను వచ్చే హరితహారం కార్యక్రమానికి ఇప్పటినుంచే ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న బీకేగూడ వార్డు కార్యాలయం స్థానంలో నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలకు బిల్లులు చెల్లించలేదనే కారణంతో విద్యుత్ సరఫరా నిలిపివేయవద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, వాటర్‌వర్క్స్ ఎండీ దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎస్‌ఎన్‌డీపీ ఈఎన్‌సీ జియావుద్దీన్, జోనల్ కమిషనర్లు రవికిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, డీసీలు మోహన్‌రెడ్డి, ముకుందరెడ్డి, ఈఈలు ఇందిర, ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్, సుదర్శన్ పాల్గొన్నారు.

కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌కు స్పందన



పద్మారావునగర్: కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన వస్తోందని నిర్వాహకుడు వినోద్ పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకే విక్రయిస్తూ అనేకమంది మన్ననలు పొందుతుందన్నాడు. ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల కాటన్‌చీరలు, చేనేత వస్త్రాలతో పాటు అన్ని రాష్ట్రాల్లో తయారైన చేనేత వస్త్రాలు, బెడ్‌షీట్‌లు, కవర్లు, వివిధ కళాకారులు చేతితో తయారు చేసిన బొమ్మలు, వివిధ రకాల వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

విద్యార్థిని అదృశ్యం

చిలకలగూడ: ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ మార్కండేయనగర్‌కు చెందిన ఓ విద్యార్థిని (18) స్థానిక కళాశాలలో ఇంటర్ చదువుతోంది. గతనెల 31న రాత్రి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. తెలిసిన వారితో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో శనివారం తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బేకరీ ప్రారంభం

అమీర్‌పేట: ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువ శాతం మంది శాఖహార పదార్థాలను ఇష్టపడుతున్నారని సినీ డైరెక్టర్ శేఖర్ కమ్ముల అన్నారు. ఎస్‌ఆర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఓ బేకరీని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

జోరందుకున్న హలీం విక్రయాలు

చిలకలగూడ : ముస్లిం సోదరులు అత్యంత నియమ నిష్ఠలతో పాటించే పవిత్ర రంజాన్ మాసంలో మాత్రమే లభించే హలీం విక్రయాలు జోరందుకున్నాయి. చిలకలగూడ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన హలీం విక్రయ కేంద్రాల వద్ద సాయంత్రం అయితే చాలు కులమతాలకతీతంగా హలీం తినేందుకు బారులుదీరుతున్నారు. చిలకలగూడ, బౌద్ధనగర్, వారాసిగూడ, మైలార్‌గడ్డ, పార్శిగుట్ట, ముషీరాబాద్, సీతాఫల్‌మండి, షాబాద్‌గూడ తదితర ప్రాంతాలనుంచి ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించేందుకు అతి ప్రాచీనమైన చిలకలగూడ బడే మసీదుకు వస్తుంటారు. వీరి సౌకర్యార్థం చిలకలగూడ నుంచి వారాసిగూడ వెళ్లే ప్రధాన రహదారిలో పలువురు నిర్వాహకులు హలీం విక్రయ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి, రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మటన్, చికెన్, వెజ్ హలీంలు తయారు చేస్తున్నప్పటికీ మటన్ హలీంకే డిమాండ్ ఎక్కువగా ఉందని, మూడు దశాబ్దాలుగా ప్రతిఏటా క్రమం తప్పకుండా హలీం విక్రయాలు చేపడుతున్నానని ఎవర్‌గ్రీన్ హోటల్ నిర్వాహకుడు సర్దార్‌భాయ్ తెలిపారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న హలీం

అన్నదానం



అన్నదానం చేస్తున్న శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: సాయిబాబా ఆశీస్సులు ఉంటే అన్ని శుభాలే జరుగుతాయని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీగణేష్ అన్నారు. రెజిమెంటల్‌బజార్‌లోని బాల గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయిబాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సబ్‌కా మాలిక్ ఏక్ హై అనే సిద్ధాంతంతో ప్రజలందరినీ ఏకం చేసి మహోన్నత సంకల్పం కలిగిన సాయిబాబా విశిష్టత ఎంతో గొప్పదన్నారు. సాయిబాబా జయంత్యుత్సవాలను ప్రతి ఏడాది వైభవంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. అలాగే ఈ కార్యక్రమంలో బాల గణపతి యూత్ అసోసియేషన్ కమిటీ నాయకులు నందికంటి రవి, జ్ఞానేశ్వర్, సతీష్, శేఖర్, శ్యామ్ పాల్గొన్నారు.

ప్రొ.అన్సారీ దీక్షకు మద్దతు



ప్రొ.అన్సారీ దీక్షకు మద్దతు తెలుపుతున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ లింగ్విస్టిక్స్ ప్రొ.అన్సారీ తనకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం దీక్ష చేపట్టారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ప్రవేశ ద్వారం వద్ద ప్లకార్డు ప్రదర్శిస్తూ దీక్ష చేపట్టగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రొ.అన్సారీకి న్యాయం చేయకుంటే ఆందోళనలు చేపడుతామని విద్యార్థి నాయకులు హెచ్చరించారు.

ఊరెళ్లి వచ్చేలోగా ఇల్లు గుల్ల

అమీర్‌పేట: సొంతూరికి వెళ్లొచ్చే సరికి బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. బల్కంపేట సుప్రభాత్‌నగర్‌కు చెందిన బాలాజీ తన కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 30న సొంతూరైన ఆంధ్రప్రదేశ్‌లోని చీరాలకు వెళ్లాడు. మరో సటి రోజు ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికెళ్లి చూడగా బీరువాలో ఉన్న 100 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు వేల నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామన్నారు.

హాస్టల్ గదిలో ల్యాప్‌టాప్ చోరీ

అమీర్‌పేట: హాస్టల్ గదిలో నుంచి విలువైన ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. ఎస్‌ఆర్‌నగర్ డీఐ రాంప్రసాద్ వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్‌లోని వర్షితరెడ్డి బాయ్స్ హాస్టల్‌లో కర్నూలు జిల్లా మంత్రాలయానికి చెందిన పి.భాస్కర్‌రెడ్డి ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తాను ఉంటున్న గదికి తాళం వేసి వెళ్లి వచ్చే తాళం పగులగొట్టి ఉంది. గదిలో పెట్టిన రూ.80 వేల విలువచేసే ల్యాప్‌టాప్ కనిపించలేదు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు.

అధునాతన వసతులతో వార్డు కార్యాలయం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు ప్రధాన రహదారిలో అధునాతన వసతులతో జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి రానుందని కార్పొరేటర్ సామల హేమ చెప్పారు. శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆమె కార్యాలయ నిర్మాణం పనులను పరిశీలించి మాట్లాడారు. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఇక్కడ వార్డు కార్యాలయ నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. గ్రౌండ్ ప్లస్ టూ తో నిర్మించే ఈ భవన సముదాయంలో జనన మరణ ధృవీకరణ ఇతరత్రా జీహెచ్‌ఎంసీ ధృవీకరణలు అందించే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. చిన్నపాటి హాల్ తదితర వసతులు వార్డు కార్యాలయంలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

ఇష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలి



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న కేశవరెడ్డి

రసూల్‌పురా: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి అన్నారు. బోర్డు రెండవ వార్డు రసూల్‌పురాలోని కస్తూర్బా పాఠశాల పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకుని తల్లిదండ్రులు, గురువులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కస్తూర్బా పాఠశాల యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్ కోసం క్రమశిక్షణతో నాణ్యమైన విద్యాబోధన చేస్తుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఓంకార బాబు, సుధా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కామర్స్ విద్యలో మార్పులు అవసరం

ప్రొ.హెచ్ వెంకటేశ్వర్లు



వార్తా పత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచంలో వ్యాపారం, వాణిజ్యంలో సంభవిస్తున్న మార్పులకు అనుకూలంగా కామర్స్ విద్యలో మార్పులు అవసరమని కేరళ సెంట్రల్ వర్సిటీ వీసీ, టీసీఏ గౌరవ అధ్యక్షులు ప్రొ.హెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఓయూ కామర్స్ ఆడిటోరియంలో తెలంగాణ కామర్స్ అసోసియేషన్ (టీసీఏ) సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి టీసీఏ ప్రసిడెంట్, కామర్స్ విభాగం హెడ్ ప్రొ.చెన్నప్ప అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై టీసీఏ భవిష్యత్తు కార్యచరణ ప్రసంగించారు. అనంతరం కామర్స్ త్రైమాసిక వార్తా పత్రికను ఆవిష్కరించారు. తొలిసారి ఓయూకు వచ్చేసిన వీసీ ప్రొ.వెంకటేశ్వర్లును కామర్స్ విభాగం అధ్యాపకులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీసీఏ జనరల్ సెక్రటరీ ప్రొ. జాస్తి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ హాస్టల్స్ అండ్ మెస్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల సకాలంలో చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకురాలు ఎస్‌ఎల్ పద్మ డిమాండ్ చేశారు. శనివారం ఓయూ పాలన భవనంలో సమావేశమై ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రతి నెల 20వ తేదీ వరకు వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగుల కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నారని, వేతనంలో కట్ అవుతున్న ఈఎస్‌ఐ, పీఎఫ్ చెల్లించాని, 400 మంది సిబ్బందికి ఈఎస్‌ఐ కార్డులను తక్షణమే అందించాలన్నారు. కాంట్రాక్టర్ల నుంచి కాకుండ నేరుగా వర్సిటీ వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో విధులను బహిష్కరించి ఆందోళనలు చేపడుతామన్నారు.

ఓయూ వసతులపై సంతృప్తి



జిబుటి రాయబారికి జ్ఞాపికను అందజేస్తున్న రిజిస్ట్రార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో చదివే విదేశీ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని జిబుటి రాయబారి హెచ్‌ఈ అబ్దిల్లాహిఅసోవే అన్నారు. శనివారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఫారెన్ రిలేషన్ ఆఫీసర్ ప్రొ.అప్పారావులతో ఓయూ కోర్సుల వివరాలు, విదేశీ విద్యార్థుల వసతుల పై చర్చించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం జిబుటి దేశానికి చెందిన 18 మంది విద్యార్థులు ఓయూలో చదువుతున్నారని భవిష్యత్తు ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతాం



సమావేశమైన విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఓయూ విద్యార్థి సంఘాల నేతలు పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట 12 విద్యార్థి సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ బోర్డు ప్రక్షాళన, చైర్మన్, సభ్యులను తొలగించి నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు ఐక్యతతో పోరాడాలని నిర్ణయించామన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



వంటకాల ప్రదర్శనలో పాల్గొన్న రేణుక, టీచర్లు

రాంగోపాల్‌పేట్: చిరు ధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, లాంటివి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక అన్నారు. శనివారం కుమ్మరిగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రిషనల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, తల్లులకు చిరుధాన్యాల వినియోగం, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. చిరు ధాన్యాల్లో పండిన పదార్థాలతో పాటు పీచు పదార్థాలు, కొంత కొవ్వును కలిగి ఉంటాయని చెప్పారు. ఐరన్, కాల్షియం కూడా ఇందులో పుష్కలంగా ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా వయసుకు తగ్గ బరువు, ఆరోగ్యవంతంగా ఉన్న శిశువుల తల్లులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సునంద, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చిరుధాన్యాల గురించి వివరిస్తున్న దీపిక

చిరు ధాన్యాల వంటకాల ప్రదర్శన..

లాలాపేట: బాలింతలు, గర్భిణులకు చిరు ధాన్యాల వంటకాలు ఎంతో మేలు చేస్తాయని సికింద్రాబాద్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక అన్నారు. శనివారం లాలాపేట వినోభానగర్‌లోని సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. రోజు వారి ఆహారంలో చిరు ధాన్యాలను చేర్చుకోవడం ద్వారా ఎంతో బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. రుచికరమైన వంట చేసిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోజారాణి, సుజాత, కృపావతి, సంధ్యారాణి, వనజ, రాజేశ్వరీ, ఐశ్వర్య, రేణుక పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తా

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నాలా పరివాహక ప్రాంతాల్లో నష్టపోతున్న బాధితులకు తోడ్పాటును అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం నల్లకుంట డివిజన్‌లో హుస్సేన్‌నగర్ నాలా విస్తరణలో నష్టపోతున్న బాధితులతో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని రత్నానగర్, దయానంద్‌నగర్‌లో ఉన్న నాలాతో భవన యాజమానులకు ప్రభుత్వం తరపున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనిపై పారదర్శకంగా సర్వే చేయించి నివేదిక ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. అర్హులైన అందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.